క్లుప్తంగా

వైభవంగా ఆలయ గోపుర కలశ ప్రతిష్ట

ఫిరంగిపురం: మండలంలోని శిరంగిపాలెం లోని బాలాంజనేయస్వామి గోపుర కలశ ప్రతిష్ట కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రెండో రోజు విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలోని ముఖమండపంలో వైఖనస ఆగమ పండితులు దీవి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు చేశారు. సాయంత్రం యాగశాలలో ఆలయ కలశాలు, శీతల యంత్రం, ధ్వజస్తంభానికి విశేషపూజలు, జలాధివాసం, క్షీరాధివాసం, పంచ గవ్యాధివాసం, అధివాసాలు నిర్వహించి నవ గ్రహారాధనలు రుత్వికులు సురేషకుమార్, గోవర్ధన్‌రఘురామ్, సురేష్, రామకృష్ణ, నాగ ఫణి నిర్వహించారు. శీతలయంత్రాన్ని విశేషంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగించారు.

అక్రమ కేసులు బనాయించడం దారుణం

మంగళగిరి: కేసులతో సంబంధం లేకపోయినా అక్రమ కేసులు బనాయించడం దారుణమని వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి వీరయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఐబీఎన్ ప్రెస్‌క్లబ్ భవనంలో బుధవారం వీరయ్య ఆయన సతీమణి దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు మేక తోటి అరుణతో కలసి విలేకరులతో మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో తెనాలికి చెందిన సుధారాణి తనపై ఫిర్యాదు చేసినట్లు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలలో నిజం లేదన్నారు. తనపై తప్పుడు కేసు బనాయించాలని టీడీపీ నాయకుల ఒత్తిడితోనే సుధారాణి ఫిర్యాదు చేసినట్లు తెలిసిందన్నారు.

పుష్కర ఘాట్‌లో చెత్తాచెదారం తొలగింపు



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం కృష్ణానది పుష్కర ఘాట్‌ల వద్ద బుధవారం కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులు క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత కొంతకాలంలో పుష్కర ఘాట్‌ల వద్ద శుభ్రం చేయకపోవడంతో ఘాట్‌మెట్లుపై చెత్త పేరుకుపోవడం, మత్తుబాబుల ఆగడాలకు ఘాట్ మొత్తం సీసా పెంకులు ఉండడంతో స్థానికులు కమిషనర్ అలీంబాషా దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు పుష్కర ఘాట్‌లను శుభ్రం చేసి పెయింటింగ్ వేస్తున్నట్లు వివరించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



తాడేపల్లిరూరల్: కోల్‌కతాలో ఆర్.జి.కర్ హాస్పిటల్‌లో ట్రైనీ వైద్యురాలిని అత్యంత పాశవికంగా లైంగిక దాడి చేసి, హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం తాడేపల్లిలో సీఐటీయూ నాయకులు ర్యాలీ నిర్వహించారు. సంఘం కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తాడేపల్లిలోని సంఘ కార్యాలయం నుంచి ప్రకాష్ నగర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రంలో ఆశ వర్కర్లు, కె. లక్ష్మి, రేణుక, బుజ్జి, అంగన్‌వాడీలు సుజాత, కిరణ్ మహి, హేమలత, తంబిరాణి, అనూష, సీఐటీయూ నాయకులు బూర వెంకటేశ్వరరావు, సుశీల, నవనీతం, సూరి, యెహోషువా, నాగమణి పాల్గొన్నారు.

160 గ్రాముల బంగారంతో ఉడాయింపు

మంగళగిరి: 160 గ్రాముల బంగారంతో బెంగాల్ యువకుడు ఉడాయించిన ఘటన చోటు చేసుకుంది. రెండు రోజుల క్రితం నకిలీ ఆధార్ కార్డుతో రమేష్ అనే పేరుతో మంగళగిరిలోని బంగారం దుకాణంలో పనికి చేరాడు. బుధవారం బంగారం కొట్టు యజమాని ప్రకాష్ 160 గ్రాముల బంగారాన్ని మరొకరికి ఇచ్చి రావాలని రమేష్‌కు బంగారం అప్పగించాడు. ఎంతసేపటికి తిరిగిరాకపోవడంతో ప్రకాష్ పట్టణ పోలీసులు ఫిర్యాదు చేశాడు.

గుంటూరు చానల్‌లో గుర్తు తెలియని మృతదేహం

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు గుంటూరు చానల్‌లో గుర్తు తెలియని మృతదేహం గుర్తించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు చానల్‌లో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలి

- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి
- తుళ్లూరు కేవీఆర్ జెడ్పీ స్కూల్ తనిఖీ



తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

తాడికొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం కింద నిర్మిస్తున్న కెమిస్ట్రీ ల్యాబ్, క్రీడా స్థలాన్ని పరిశీలించి, సూచనలు జారీ చేశారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడిన ఆమె బోధనాంశాలపై పట్టును పరిశీలించి ఆంగ్లంపై ఉన్న పట్టును తెలుసుకునేందుకు బోర్డుపై పదాలు రాసి విద్యార్థులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉందని, ఈ ఏడాది నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేసి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు ఏఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో గుర్తించి ప్రత్యేక శ్రద్ధ కనబరిచి శిక్షణ అందించాలని కోరారు.

కేంద్ర పథకానికి ఎంపిక

అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం కింద జిల్లాలో మొదటి విడతలో 21 స్కూళ్లు, రెండో విడతలో 4 స్కూళ్లు ఎంపికయ్యాయన్నారు. ఆరు పారా మీటర్లతో పాఠశాలను మోడల్ స్కూళ్లుగా తయారు చేయడమే పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఉన్నత పాఠశాలలే కాకుండా ఇందులో కొన్ని ప్రైమరీ స్కూళ్ళు కూడా ఈ పథకం కింద ఎంపికయ్యాయని, తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను పీఎంశ్రీ కింద ఎంపికైందని, ఆయా పాఠశాలల్లో విద్యార్థులు తన నైపుణ్యాలను పెంచుకోవడానికి ల్యాబ్‌లు, బయాలజీ, సైన్స్ ల్యాబ్‌లు, కెమిస్ట్రీ ల్యాబ్ ఇంటిగ్రిటీ ల్యాబ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాబ్‌లు అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. తుళ్లూరు జెడ్పీ హైస్కూల్ సీఆర్‌డీఏ నుంచి స్మార్ట్ స్కూల్ ప్రాజెక్టుగా ఎంపికైందని, దీనికి ఈ పథకం కింద క్రీడా పరికరాలు అందజేయడం జరుగుతుందన్నారు. పాఠశాలలో సీబీఎస్‌ఈ సిలబస్ ఉందని, పాఠశాల టీచర్లకు సమ్మర్ హాలిడేస్‌లో డైట్ సెంటర్‌లో సమగ్ర శిక్షణ అందించడం జరుగుతుందని వివరించారు. పూర్వ విద్యార్థులు, పెద్దలు పాఠశాలకు సాయం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ విజయలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి దుర్గాబాయి, ఈఈ నాగజ్యోతి, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎంఈఓలు రాజశేఖర్, అబ్దుల్ సుభానీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం సరఫరాలో నాణ్యత పాటించాలి

మంగళగిరి: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరాలో నాణ్యత పాటించడంతో పాటు రుచికరమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న అక్షయ పాత్ర ఫాండేషన్ ఆవరణలోని వంటశాలను సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐదు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అక్షయపాత్ర భోజనం చేస్తుందన్నారు. మెనూ ప్రకారం సమయానికి భోజనం సరఫరా చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ కోమలి పద్మ, ఏడీఏ రాజాబాబు, తహసీల్దార్ ఎస్‌కే సుభాని పాల్గొన్నారు.

రజక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

మంత్రి సవితకు సంఘ నాయకుల వినతి



మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రజక వృత్తిదారుల సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: రజక అభివృద్ధి– సంక్షేమ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితకు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదార్ల సంఘం నాయకులు బుధవారం విన్నవించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు. భాస్కరయ్య మాట్లాడుతూ ఇస్త్రీ చేసుకుంటున్న రజక వృత్తిదారులకు ప్రభుత్వం చెప్పిన విధంగా 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను మంజూరు చేయాలని కోరారు. మోడ్రన్ దోబీ ఘాట్స్ సిటీ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని, రజకులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని, ఆదరణ పథకం ద్వారా వృత్తి పరికరాలు అందించాలని కోరారు. 50 సంవత్సరాలు దాటిన ప్రతి రజక వృత్తిదారునికి పెన్షన్ అవకాశం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన మంత్రి సవిత రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బొజ్జ సుబ్బారావు, దావులూరి శ్రీనివాసరావు, నూతక్కి నాగేశ్వరరావు, మంగళగిరి– తాడేపల్లి నగర గౌరవ అధ్యక్షులు మోర్త్తోట సుబ్బారావు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్లకు బంగారు పతకాలు



పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్లతో కోచ్ సంధాని

మంగళగిరి: గుంటూరు జిల్లా జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ మాస్టర్స్ మెన్స్ ఉమెన్స్ పోటీలలో మంగళగిరికి చెందిన పవర్‌లిఫ్టర్లు పతకాలు సాధించినట్లు కోచ్ సంధాని తెలిపారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన తెనాలి పట్టణంలో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. సబ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో 43 కేజీల కేటగిరిలో పి.శ్రావణి సిల్వర్ మెడల్, 69 కేజీల విభాగంలో పి.అంజిలి గోల్డ్ మెడల్ సాధించగా జూనియర్ విభాగంలో 47 కేజీల విభాగంలో పి.శ్రావణి సిల్వర్ మెడల్, 57 కేజీల కేటగిరిలో షేక్ సాదియా ఆల్మాస్ గోల్డ్ మెడల్, 69, 84 కేజీల విభాగాలలో పి.అంజలి, షేక్ షబీనాలు గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. సీనియర్, బ్రెంచ్ ప్రెస్ పోటీలలో 43 కేజీలు, 76 కేజీల విభాగాలలో పి.శ్రావణి, ధనశ్రీలు సిల్వర్ మెడల్స్ సాధించగా 57, 63, 69, 69, 84 కేజీల విభాగాలలో సాదియా ఆల్మాస్, వినీత, భవాని, అంజిలి, షేక్ షబీనాలు బంగారు పతకాలు సాధించగా పలువురు అభినందించినట్లు తెలిపారు.

కరాటే అకాడమీ ప్రతినిధులకు మంత్రి అభినందన



కరాటే పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను అభినందిస్తున్న ఐటి శాఖమంత్రి నారా లోకేష్

తాడేపల్లిరూరల్: కరాటే పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను మంత్రి నారా లోకేష్ ఉండవల్లిలోని ఆయన కార్యాలయంలో బుధవారం అభినందించారు. ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు చండీఘడ్‌లో నిర్వహించిన పోటీలలో జేకే గోజుర్యూ కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా అకాడమీ ఉండవల్లి బ్రాంచి కోచ్ బి.నరసింహారెడ్డి మాట్లాడుతూ భవానీపురం, ఉండవల్లి బ్రాంచి నుంచి మొత్తం ఏడుగురు క్రీడాకారులు పాలక్ సోలంకి, కె. హరిచందన, తేజశ్రీసాయి, వి.సాధ్విక్, భువన్ సాయి, ఎస్‌కె సాఫియా, చార్వి అగర్వాల్ పాల్గొని మెడల్స్ గెలుపొందారని చెప్పారు. కార్యక్రమంలో అకాడమి భవానీపురం మెయిన్ బ్రాంచ్ కోచ్ కె. హరినాథ్ పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

'చలపతి' చైర్మన్ వైవీ ఆంజనేయులు



మోతడక(తాడికొండ): ఇంజినీరింగ్ విద్యానభ్యసించే విద్యార్థులు భవిష్యత్‌లో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అన్నారు. ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని పురస్కరించుకొని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ఎంటర్‌ప్రెన్యూవర్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థి దశలోనే నూతన ఆవిష్కరణలు చేసి పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా భవిష్యత్‌లో ఉద్యోగ కల్పన స్థాయికి ఎదిగి పారిశ్రామిక వృద్ధిని పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ కొల్లా నాగ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో అకడమిక్స్ డీన్ పి.ఫణికుమార్, ఏఐ హెడ్ సుంకర శాంతిప్రియ పాల్గొన్నారు.

దళితుల్లో ఎస్సీ వర్గీకరణ చిచ్చు..



తాడికొండలో ఆందోళన చేస్తున్న నాయకులు

తాడికొండ: దళితులకు రాజ్యాధికారం దక్కకుండా చిచ్చుపెట్టేందుకే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అని దళిత నాయకులు పిల్లిరాజు, తమ్మనంపల్లి రాజు పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పిలుపునిచ్చిన భారత్ బంద్‌లో భాగంగా తాడికొండ అడ్డరోడ్డులో మాల సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వర్గీకరణ వద్దు ఐక్యతే ముద్దు అంటూ పలువురు నినాదాలు చేసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దళితులను విడదీసే క్రమంలో రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించి నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని ఆరోపించారు. కార్యక్రమంలో దళిత నాయకులు దేవరపల్లి చినపాములు, కొప్పుల బాబి గౌతమ్, దూసరి డేవిడ్, మాదాసు నీలాంబరం, గద్దె రూబేన్, మాదాసు లోకయ్య, యల్నాటి నరసింహారావు, బెజ్జం రాజేష్, మార్కు, కర్రి సుబ్బారావు, ముచ్చు ఆనంద్ పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

మంగళగిరి: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాల సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన బంద్ విజయవంతం అయింది. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పట్టణంలో మాల సంఘాల ప్రతినిధులు వీధులలో పర్యటించి దుకాణాలు మూసివేయించి బస్సులను ఆపారు. అనంతరం బస్టాండ్ వద్ద ఆందోళన నిర్వహించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే నిలపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల్లో నైపుణ్యాలు పెంపొందించాలి



బోధన ఉపకరణాలు అందజేస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రత్యేక అవసరాల పిల్లల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించాలని సమగ్ర శిక్ష గుంటూరు జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం రాజాగారి తోటలో నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలోని ప్రత్యేక అవసరాలు కలిగిన బాలల కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతులైన బాలలకు భారత్ వికాస్ పరిషత్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో రూ.10 వేలు విలువైన బోధన ఉపకరణాలను అందజేశారు. ఈసందర్భంగా భారత్ వికాస్ పరిషత్ గౌరవాధ్యక్షుడు ఐ. చలపతిరావు మాట్లాడుతూ పుట్టుకతో వివిధ శారీరక, మానసిక వైకల్యంతో బాధ పడుతున్న చిన్నారుల్లో పరివర్తన తీసుకురావడంతో పాటు ఇతర బాలలలో సమానంగా జీవించేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు శిక్షణ అందించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి టీఎన్ రాజశేఖర్, సభ్యులు బి.మల్లికార్జునరావు, రఘువీర్, ఎస్వీ రమణ, రవిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురుబ్రహ్మం, ఉపాధ్యాయులు గాడిపర్తి శ్రీధర్, భారతి పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

పట్నంబజారు: వివాహిత అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. ఒడిశాకు చెందిన బహదూషా దీక్షతో సంగ్రామ్‌కుమార్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. దీక్ష చెవిటి, మూగ దివ్యాంగురాలు. ఈక్రమంలో బుధవారం భర్త సంగ్రామ్‌కుమార్, అత్త ఉషాకుమారి బయటకు వెళ్లి వచ్చేసరికి దీక్ష కనబడలేదు. ఉషాకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌టాక్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల విజేతలతో నిర్వాహకులు

గుంటూరు ఎడ్యుకేషన్: కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో బుధవారం ఇన్‌టాక్ సంస్థ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌టాక్ గుంటూరు జిల్లా కో–కన్వీనర్ ఏ.రవి శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశ చారిత్రక పురాతన కట్టడాల ప్రత్యేకత, వాటి పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలు, పురాతన జీవన విధాన ఔన్నత్యాన్ని భావి తరాలకు తెలియజేసే విధంగా ఇన్‌టాక్ సంస్థ పని చేస్తోందని తెలిపారు. ఈసందర్భంగా గుంటూరు నగరంలోని వివిధ పాఠశాలల నుంచి పోటీ పడిన విద్యార్థి బృందాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌టాక్ సంస్థ సభ్యులు అడపా వేణుగోపాల్, యువ ఆర్కియాలజిస్ట్ శ్రీనాథ్ రెడ్డి, సభ్యులు పిచ్చిరెడ్డి, జుటూరి సాయి పాల్గొన్నారు.

కేఎల్పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

జాతీయస్థాయి క్విజ్ పోటీలో డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య తెలిపారు. జేకేసీ కళాశాలరోడ్డులోని కేఎల్పీ స్కూల్లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రత్తయ్య మాట్లాడుతూ ఇన్‌టాక్ సంస్థ భారతీయ విద్యాభవన్‌లో భారతదేశ వారసత్వ సంస్కృతి, సంప్రదాయాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో నగరంలోని 15 పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీపడినట్లు తెలిపారు. ప్రిలిమినరీ పరీక్షలో గెలుపొందిన కేఎల్పీ స్కూల్ విద్యార్థుల బృందం ద్వితీయ, తృతీయ రౌండ్లను అధిగమించి ప్రథమస్థానంలో నిలిచారని వివరించారు. పి.రిషి సాత్విక, జె. సాత్విక్ వర్మ జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటు రూ.వెయ్యి నగదు గెలుపొందారని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఏవో కె. వెంకట్రావు అభినందించారు.

రామాయణంపై ధారావాహిక ప్రవచనం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం సంక్షిప్త రామాయణం ధారవాహిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కేవీ కోటేశ్వరరావు ప్రసంగిస్తూ వాల్మీకి పలుకులను శ్రీరాముడు ఆలకించారని అన్నారు. శాంతంగా నీ సందేహాలు తీర్చడం నా కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రభువైన భరతుని ప్రతినిధులమని, మా రాజ్యంలో ధర్మహీనులను దండించే బాధ్యత, హక్కు తమకు ఉన్నాయని చెప్పారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కులు అందజేత

నగరంపాలెం: జిల్లా ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వర్తించే ఏఆర్ ఎస్ఐ ప్రసాద్‌రావు, కానిస్టేబుళ్లు లూదియరావు, సోమేశ్వరరావు, ఏపీఎస్‌సీ డీసీఎల్ హోంగార్డు జయదాస్‌అనారోగ్య కారణాలతో వేర్వేరు నెలల్లో మృతిచెందారు. ప్రసాదరావు భార్య రమ్యకృష్ణకు అదనపు కార్పస్ ఫండ్ లక్ష రూపాయలు, లూదియ రావు భార్య మేర్సీగ్రేస్‌కి రూ.1.75 లక్షలు, సోమేశ్వరరావు భార్య మాధవికి రూ.1.75 లక్షలు, హోంగార్డు జయదాస్ భార్య శాంతకుమారికి రూ.10 వేల చెక్కులను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రమాదేవి, పోలీస్ సంఘం సభ్యులు హుస్సేన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ



పట్నంబజారు: ఇంటి తలుపులు తొలగించి చోరీకి పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పి.కిరణ్ తెలిపిన వివరాలు.. బ్రాడీపేటలో నివాసం ఉండే ఎం.సీతారామచంద్రమూర్తి ఈనెల 18న కుటుంబంతో కలసి అరుణాచలం వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం ఇంటికి వచ్చారు. వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించారు. లోపలకు వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి అందులోని సుమారు ఐదు సవర్ల బంగారం, పలు వెండి ఆభరణాలు గురుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పట్టాభిపురం పీఎస్‌హెచ్‌ఓ కిరణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాల్యవివాహంతో ఆరోగ్యసమస్యలు



పాఠశాలలో మానవ హారంగా నిలిచి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు జెడ్పీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు బాల్యవివాహం చేసుకోవడం వలన కలిగే ఇబ్బందులపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ చిన్న వయస్సులో బాల్యవివాహాలు చేసుకోకూడదని చెప్పారు. దీనివల్ల ఆరోగ్యపరమైన ఎన్నో సమ్యలు వస్తాయన్నారు. ఎవరైన బలవంతంగా బాల్య వివాహం చేయిస్తున్నా చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098కి ఫోన్ ద్వారా తెలియజేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో మానవ హారంగా నిలిచి వారిచే బాల్యవివాహ నిషేధ చట్టం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎ. ఇమ్మానియేల్, ఉపాధ్యాయురాలు సుజాత, అంగన్‌వాడీలు సునీత, సీతారాఘవ, ఏఎన్‌ఎం మేరిశిరీష పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్పలో వసతులకు చర్యలు

- నగరపాలక సంస్థ కమిషనర్ పి. శ్రీనివాసులు
- చౌడవరంలో గృహ సముదాయాల పరిశీలన



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని 26వ డివిజన్ నందున్న చౌడవరం గ్రామం రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో మౌలిక వసతులను కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ చౌడవరంలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులను పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గృహకల్ప బ్లాక్‌ల పరిసరాల్లో పిచ్చి మొక్కలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రెండు రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డీడీ గ్రౌండ్ వాటర్ వారితో సమన్వయం చేసుకొని, గృహకల్ప సముదాయంలో రెండు ప్రాంతాల్లో బోర్లు వేయడానికి పాయింట్లు గుర్తించి, అంచనాలు సిద్ధం చేయాలన్నారు. అపార్ట్‌మెంట్‌పైన ఉన్న నీటి ట్యాంక్‌లు, వాటిలో ప్రస్తుతం వినియోగంలో ఉన్నవి, లేనివి, నూతనంగా అవసరమైన వాటి వివరాలతో గురువారానికి నివేదిక ఇవ్వాలని ఏఈని ఆదేశించారు. గృహకల్ప నివాసాలకు ఆస్తి పన్ను వేయడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారిని ఆదేశించారు. చెత్త సేకరణ, డ్రైన్ల శుభ్రం జరగాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ని, కార్యదర్శిని ఆదేశించారు. చౌడవరం మెయిన్ రోడ్‌లోని జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్‌పై డ్రెయిన్ నీరు వస్తుందని, సదరు అధికారులతో సమన్వయం చేసుకొని సమస్య పరిష్కారనికి చర్యలు తీసుకోవాలని ఈఈని ఆదేశించారు. ఆయనవెంట ఈఈ కొండారెడ్డి, ఏఈ రవికిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



గుంటూరు మెడికల్: అవకాశాలు మనదగ్గరకు రావని, వాటిని మనమే సృష్టించుకుని వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. బుధవారం మంగళగిరి కేఎల్ యూనివర్సిటీలోని పీకాక్ హాలులో కేఎల్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్(కెఎల్ ఐపీఎఫ్ సీ), కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి లెవెల్ ఐపీ ఉమెన్ బిజినెస్ సమ్మిట్–2024 నిర్వహించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ చిన్న వ్యాపారమైన సరే దానిలో ఎంత ఫండింగ్ రాబట్టాలి అనే ఒక ప్రణాళిక ద్వారా ముందుకు అడుగులు వేస్తే ఆ వ్యాపారం విజయవంతం అవుతుందన్నారు. ఒక సాధారణ హాస్పిటల్‌గా ప్రారంభమైన హోప్ విన్ హాస్పిటల్ నేడు ప్రజాదరణ పొందిన విధానాన్ని గురించి వివరించారు. మైక్రోస్మాల్ మినీ ఎంటర్‌ప్రైజెస్ గురించి వివరించారు.

బార్ కార్యాలయంలో ప్రథమ చికిత్స కిట్ ఏర్పాటు

నగరంపాలెం: జిల్లా కోర్టు ఆవరణలోని ది గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం ప్రథమ చికిత్స పెట్టెను ఏర్పాటు చేశారు. ఈ పెట్టెను న్యాయవాది నారదాసు వీరమణింద్ర అందజేశారు. న్యాయవాదులకు ప్రథమ చికిత్స నిమిత్తం ఉపయోగపడనుందని బార్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి అన్నారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎ.అనూరాధ, న్యాయవాదులు న్యాయవాది వీరమణీంద్ర, జిలానీ, నూనె పవన్‌తేజ, కట్టా జవహర్‌బాబు, మైలా జాన్, జాబీజ్ పాల్గొన్నారు.